

తిరుమలకూ హ్యాప్రీ బస్!

తిరుపతి-తిరుమల నడుమ కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేసిన ప్రకటన మహిళా యాత్రికులను మహదానందానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ఉచితంగానే తిరుపతికి చేరుకున్నా తిరుమలకు మాత్రం చార్జీలు చెల్లించాల్సిరావడం వీరిని అసంతృప్తికి గురిచేసింది. తాజా నిర్ణయం అమలు తేదీ కోసం వీరంతా ఎదురు చూస్తున్నారు. నిజానికి తిరుమలకు ఉచితం చేయడం వల్ల ఆర్టీసీ మీద పడే భారం కూడా ఏమంత ఎక్కువ కాదు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- ఏటా 25 లక్షల మంది మహిళలకు లబ్ధి
- ప్రభుత్వంపై రూ.23 కోట్ల అదనపు భారం
- త్వరలో మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశం

స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తే ఏటా పాతిక లక్షల మందికి పైగా మహిళా ప్రయాణికులకు లబ్ధి చేకూరనుంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.23 కోట్ల వరకూ భారం పడనుంది. ఈనెల 15వ తేదీ నుంచీ రాష్ట్రవ్యాప్తంగా నిర్ణీత ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే తిరుపతి-తిరుమల మధ్య నడిచే ఆర్టీసీ బస్సుల్లో మాత్రం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం వర్తించదని ప్రకటించిడం తెలిసిందే. దీనిపై వివిధ వర్గాల నుంచీ వచ్చిన విన్నపాలు, సలహాలు, సూచనలతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దీంతో తిరుపతి-తిరుమల నడుమ మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వర్తింపజేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు మంగళవారం ఆర్టీసీ చైర్మన్ ప్రకటించారు. ఆ నిర్ణయం అమల్లోకి వస్తే ప్రభుత్వంపై రూ. 23 కోట్లు అదనపు భారం పడనున్నప్పటికీ ప్రభుత్వం సంతోషంగానే దానికి సిద్ధపడుతున్నట్టు సమాచారం.

ఏటా పాతిక లక్షల మందికి ప్రయోజనం

ప్రస్తుతం తిరుపతి-తిరుమల నడుమ 298 డీజిల్ బస్సులు, 64 ఏసీ సదుపాయంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో ఏసీ కలిగిన ఎలక్ట్రిక్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. మిగిలిన బస్సులు తిరుపతి-తిరుమల నడుమ రోజుకు 1160 ట్రిప్పులు (రానుపోను కలిపి ఒక ట్రిప్పు) తిరుగుతున్నాయి. వీటిల్లో రోజుకు 45 వేల మంది తిరుమల- తిరుపతి నడుమ ప్రయాణిస్తున్నారు. వీరిలో 35 శాతం మంది మహిళలు. అంటే 13,500 మంది ఆడవాళ్ల . వీరిలోనూ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వారు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. ఇక ఏపీకి చెందిన మహిళా ప్రయాణీకల సంఖ్య సగటున ఒక ట్రిప్పుకు 6 మంది చొప్పున ఉంటారని అంచనా. ఆ లెక్కన రోజుకు సుమారు 7 వేల మంది ఏపీ మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. నెలకు 2.10 లక్షల మంది, ఏడాదికి 23 లక్షల మంది వంతున కొండకు వెళ్ళి వస్తున్నట్టు ఆర్టీసీ అంచనాలు చెబుతున్నాయి. అయితే వీరిలో భక్తులే కాకుండా టీటీడీలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు, చిరు వ్యాపారులు, కూలీలు సైతం వున్నారు.

రూ.180 మిగులుతుంది

తిరుపతి-తిరుమల నడుమ దూరం 24 కిలోమీటర్లు. ఆర్టీసీ డీజిల్ బస్సుల్లో చార్జీ ఒక వైపునకు రూ.90లు. అంటే ఒక మహిళకు తిరుమలకు వెళ్లిరావడానికి 180 రూపాయలు ఖర్చవుతుంది. దీన్ని ఉచితం చేయడం వల్ల కుటుంబాలతో తిరుమల కొండకు వచ్చేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుంది. అయితే తిరుమలకు ఉచితం చేస్తే ఆర్టీసీ మీద పడే భారం ఏడాదికి రూ. 23 కోట్లు. ఉచిత ప్రయాణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 1960 కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడింది. ఈ 23 కోట్లు మోయలేనంత భారం కాదు. భక్తుల్లో సంతోషం నింపడానికి ఇది కారణం అవుతుంది. ఇవన్నీ పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం ఉచిత నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.





నెల తర్వాత అందుబాటులోకి స్వామి పుష్కరిణి

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తిచేసుకుని బుధవారం నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఏటా బ్రహ్మోత్సవాల ముందు శ్రీవారి పుష్కరిణిని మరమ్మతులను చేయడం పరిపాటి. ఈక్రమంలో జూలై 20వ తేదీన పుష్కరిణిలో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. పాత నీటిని తొలగించి అడుగుభాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచి తొలగించారు. మెట్లకు రంగులు వేశారు. దాదాపు కోటి లీటర్ల నీటితో పుష్కరిణిని నింపి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మరమ్మతుల సందర్భంగా నెల పాటు నిలిపేసిన పుష్కరిణి హారతిని తిరిగి ప్రారంభించడంతో పాటు భక్తులనూ పుష్కరిణిలోకి అనుమతించారు.

మార్గదర్శిగా కమిషనర్

- 7 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మౌర్య



బంగారు కుటుంబాలతో కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఏడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనరు ఎన్.మౌర్య 'మార్గదర్శి'గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం కింద నగరంలో పేదరికం నిర్మూలనకు ఆమె ముందుకొచ్చారు. ఆ బంగారు కుటుంబాల సభ్యులు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాల్లో పునాదులు ఏర్పడేందుకు, అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేని చిన్నారికి, తండ్రి లేని ఇద్దరు పిల్లలకు, తండ్రి లేని మరో బాలికకు విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. ఓ కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తానని, జీవనోపాధి కోసం ఒకరికి తోపుడు బండి, కిరాణా షాపు పెట్టుకునేందుకు ఆర్థికంగా సాయం అందించేందుకు మౌర్య అంగీకరించారు. నగరంలోని పేదలకు (బంగారు కుటుంబాలు) ఏదో విధంగా సాయం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కలెక్టర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

రేణిగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయ సమీపం ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ టెక్నాలజీస్ భవనంలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సోక్స్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. అమరావతి నుంచి సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్వీయూ వీసీ అప్పారావు, జేసీ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇక్కడి సోక్స్ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరిలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. యువ పారిశ్రామికులకు, స్టార్టప్ పెట్టాలనుకునే వారికి, మంచి ఆలోచనలుండి మార్గదర్శకత కోసం వేచిచూస్తున్న వారికి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1600 మంది యువకులు తమ కంపెనీలు ప్రారంభించేందుకు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. హబ్ అమరావతిలో ఉంటుందని, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతిలో ఐదు సోక్స్ కేంద్రాలు ఏర్పాటు చేశారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కేంద్రానికి లీడ్ అదానితో పాటు నవయుగ, అమర్‌రాజా లీడ్ పార్టనర్లుగాను, ఐఐటీ నాలెడ్జ్ పార్టనర్‌గా ఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్, అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. అందరూ కలిస్తేనే ఇన్నోవేషన్ సాధ్యమని చెప్పారు. అకడమిక్‌పరంగా యూనివర్సిటీలు.. ఇండస్ట్రీపరంగా చూస్తే శ్రీసిటీ, మేనకూరు సెజ్ ఉండగా, రౌతుసూరమాల వస్తున్నదన్నారు. క్రిస్ సిటీ, రేణిగుంట విమానాశ్రయం వద్ద ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్-1, 2 ఉన్నాయన్నారు. జిల్లాలో మంచి ఇండస్ట్రీ వాతావరణం ఉందని, ఎవరైనా ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. తిరుపతితో పాటు చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలవారూ ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మత్స్యశాఖ, సెన్సార్ సింక్ ఇన్నోవేషన్, కేతన టెక్ బీస్, ఆటో కంపోసైట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోక్స్ లింక్, కార్బన్ సెల్స్ మనోడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పైపర్ పిక్సెల్ రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, మైండ్ ట్రానిక్స్, జుమాంజి బాక్స్ రోబో మాక్ ఎస్టీఈఎస్ వాటర్ సొల్యూషన్స్, కోకో మంత్రా, ఎనర్జీ ఎఫిషియన్ అండ్ ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీ ఫోరం, ఏఈడీఏ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పలియో జ్యూస్ సంస్థల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ వివేక్ చౌదరి, ప్రజాప్రతినిధులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు పాల్గొన్నారు.



స్టాల్‌లో ఏర్పాటు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తూ..

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

భాకరాపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ నగరి సిరిగల వారిపల్లె గ్రామ పరిసరాల్లో ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తున్నది. మంగళవారం రాత్రి గుడ్లూరు బండ ప్రాంతంలో సంచరిస్తూ సిరిగల వారిపల్లెలో పి.సుధాకర్‌కు చెందిన వరి, మిరప పంటలు, వై.మురళికి చెందిన టమోటా, వరి పంటలను ధ్వంసం చేసింది. అటవీ సరిహద్దు ప్రాంతంలో రైతులు పంట పొలాల దగ్గరకు వెళ్లడానికి భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఒంటరి ఏనుగును తలకోన అడవిలోకి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.



నగరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయండి

- సెప్టెంబరు మొదటివారంలోపు..
- అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల మొదటి వారంలోపు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేది వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మాడవీధుల్లో తిరిగారు. గ్యాలరీల నుంచి భక్తులు ఇబ్బంది పడకుండా వాహనసేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సెప్టెంబరు మొదటి వారంలోపు ఇంజినీరింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరుపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. మాడవీధుల్లో అదనపు మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ ఏడాది అదనపు ట్రిప్పుల కోసం ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. ముందస్తుగా పార్కింగ్ ప్రణాళికలు రూపొందించామని వివరించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీఈవో లోకనాథం, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాడవీధిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో తదితరులు

118 అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్!

- పదో తరగతి ఉత్తీర్ణులైన కార్యకర్తలకు పదోన్నతి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చింది. ఆ మేరకు అంగన్వాడీ మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో జిల్లాకు సంబంధించి 118 వరకున్నాయి. జిల్లాలో 2,492 అంగన్వాడీ కేంద్రాలుండగా, అందులో 361 మినీ అంగన్వాడీ సెంటర్లు. ఈ మినీ అంగన్వాడీ కేంద్రాల్లో దాదాపు 118 మెయిన్‌గా అప్‌గ్రేడ్ కానున్నాయి. వీటిలో పనిచేస్తున్న(పదవతరగతి ఉత్తీర్ణులై) కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటి వరకు వీరికి నెలకు రూ.7వేలు గౌరవ వేతనం వచ్చేది. పదోన్నతి లభించడంతో ఆ గౌరవవేతనం రూ.11,500 కు పెరగనుంది. ఈ ఉత్తర్వులపై అంగన్వాడీల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 118 సెంటర్ల వరకు అప్‌గ్రేడ్ కానున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతభాయ్ తెలిపారు. కాగా, మిగిలిన అంగన్వాడీ కేంద్రాలలో పది మందికంటే తక్కువ పిల్లలుండే వాటిని.. కిలోమీటరు పరిధిలోని మరో అంగన్వాడీ కేంద్రంలో విలీనం చేయనున్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం ఎర్రచందనం రాష్ట్ర కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన పి. మురుగన్, ఎస్.సురేష్, ఎం.చిన్నపయన్ 2017లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్సు, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. దాదాపు ఎనిమిదేళ్ల పాటు కేసు విచారణ సాగింది. తాజాగా బుధవారం నేరం రుజువు కావడంతో వీరికి ఐదేళ్ల పాటు జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అభయం



చంద్రగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ అనంతరం విశేషంగా అలంకరించారు. తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేధర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులొచ్చేశాయ్



చంద్రగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. తహసీల్దార్ కార్యాలయంలో ఈ ఈ కార్డులను ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం పరిశీలించారు. అనంతరం మండలంలోని ఎంతమందికి రేషన్ కార్డులు ఉన్నాయని, ఎన్ని కార్డులు వచ్చాయని తహసీల్దార్ శివరామసుబ్బయ్యను ఆరా తీశారు. స్మార్ట్ రేషన్ కార్డులు పర్సులో పెట్టుకోనే విధంగా ఉన్నాయంటూ కొనియాడారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, కొండూరు ప్రవీణ్‌రాయల్, పులికంటి మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం మండలాల్లో అనారోగ్య, ఇతర సమస్యలతో బాధపడుతున్న పలువురికి రూ.19.47లక్షల మేర అందజేశారు. బాధితుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సాయం మంజూరయ్యేలా ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారు. కష్టకాలంలో తమ కుటుంబాలను ఆదుకున్న చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నానీలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. **ఎర్రావారిపాలెం;** కోటకాడపల్లె పంచాయతీ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న దుద్యాల కృష్ణవేణికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.23 వేలు మంజూరయ్యాయి. ఈమేరకు చెక్‌ను ఎమ్మెల్యే నాని అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ్,యూత్ ప్రసిడెంట్ నిరంజన్‌రాయల్, మీడియా కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్‌పర్సన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సావిత్రి

పాకాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) చైర్‌పర్సన్‌గా కె.సావిత్రి, సభ్యులుగా జె.ఆనంద్, పి.కిరణ్‌కుమార్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సింగిల్ విండో కార్యాలయంలో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. మండల టీడీపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది నూతన కార్యవర్గాన్ని అభినందించారు. చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణానికి చర్యలు చేపడుతామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని, మండల టీడీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, సీఐ సుదర్శన ప్రసాద్, డీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి, సూపర్‌వైజర్ దొరస్వామి, సింగిల్ విండో సీఈవో మురళి, నాయకులు ఎం.వెంకటాద్రిబాబు, చాముండేశ్వరి, బొల్లినేని మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరానికి విశేష స్పందన



రామచంద్రాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కమ్మపల్లి పశువైద్యకేంద్రం ఆధ్వర్యంలో గంగిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. 70 పశువులకు పలు పరీక్షలునిర్వహించారు. పాడిరైతలుకు ఉచిత మందులను పంపిణీ చేసి తగు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా కమ్మపల్లి పశువైద్యాధికారి జయకిషోర్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు హేమకుమార్, రామకృష్ణ, సుమన్‌కుమార్, సహాయ సంచాలకులు పశువైద్యసిబ్బంది దామోదర్, నీలిమ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు అడ్డుకోవడం సరికాదు



అధికారులతో చర్చిస్తున్న పరిరక్షణ కమిటీ సభ్యులు

తిరుపతి రూరల్, తిరుపతి(కల్చరల్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్‌లో బంజారా కులస్థుల ఆధ్వర్యంలో చేపడుతున్న హథీరాం బావాజీ ఆలయ నిర్మాణ పనులను అడ్డుకోవడం సరికాదని తెలంగాణ జనసేన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌నాయక్ పేర్కొన్నారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుక్యా శావానాయక్‌తో కలసి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంజారాబిడ్డలు తమకులదైవం బావాజీపై భక్తితో ఆలయాన్ని నిర్మిస్తుంటే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అశోక్‌రాథోడ్, సామ్రాజ్‌నాయక్, శివానాయక్ పాల్గొన్నారు. అనంతరం ఆయన **తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠాన్ని పరిశీలించారు. మఠం భవనం కూల్చివేత** విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశామన్నారు. మరోసారి కలిసి వివరిస్తామన్నారు. ఈ సందర్భంగా మఠం అధికారులతో మాట్లాడారు. హథీరాం మహారాజ్ పరిరక్షణ కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

ఆంత్రాక్స్‌పై ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న వీసీ జేవీ రమణ, డాక్టర్ కుమణన్, డాక్టర్ రాణీప్రమీల తదితరులు

తిరుపతిరూరల్,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ లేబొరేటరీ(ఎస్ఎల్‌డీఎల్) ఆధ్వర్యంలో డీబీటీ సహకారంతో ఆంత్రాక్స్ వ్యాధి నిర్మూలన-సవాళ్లపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ మాట్లాడుతూ.. ఆంత్రాక్స్‌వ్యాధిని నిర్మూలించడంలో ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. క్షేత్రస్థాయిలో నిర్మూలించేవరకు శాస్త్రవేత్తలు యథావిధిగా సాంకేతిక సహకారాన్ని అందించాలన్నారు. రైతులకు అండగా ఎస్ఎల్‌డీఎల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ రాణీప్రమీలను అభినందించారు. ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డి.రాణీప్రమీల మాట్లాడుతూ..డీబీటీ నెట్‌వర్క్ ప్రాజెక్టికి సంబంధించిన సిఫారసులను ఎక్స్‌పర్ట్ కమిటీ నేతృత్వంలో ఖరారు చేశామన్నారు. శాస్త్రీయసహకారాన్ని కొనసాగించే దిశగా ముందుకు వెళ్లాలని కమిటీలో నిర్ణయించామని తెలిపారు. డీబీటీ నిపుణుడు డాక్టర్ కె.కుమణన్, శాస్త్రవేత్త డాక్టర్ నరేష్‌జిందాల్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వీనూ, డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, ప్రాజెక్ట్ అనుబంధసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రగిరి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు స్కూటర్ల దగ్ధం



తిరుపతి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె ఇందిరమ్మ కాలనీ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు స్కూటర్లు దగ్ధమైన ఘటన బుధవారం వేకువ జామున చోటు చేసుకుంది. బాధితులు జయచంద్ర, అన్సర్ వివరాల మేరకు.. మంగళవారం రాత్రి ఇంటి ముందు స్కూటర్లు పార్క్ చేశామని, వేకువ జామున చుట్టుపక్కల వారు గమనించి చెప్పడంతో ఇంట్లో నుంచి వచ్చి చూసేసరికి కాలి బూడిదయ్యాయని తెలిపారు. కాగా స్థానికులు వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే పూర్తిగా కాలిపోయాయి. బాధితులు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా వీరివురు శ్రీనివాసం యాత్రికుల వసతి సముదాయంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు.

శ్రీవారి సేవలో రైల్వే జీఎం



సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్ ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు స్వర్ణముఖి కాజ్‌వే సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మేనకూరుకు చెందిన శరవణ, సాయి మోటారు సైకిల్‌పై బుధవారం సాయంత్రం మేనకూరుకు వెళ్తుండగా స్వర్ణముఖి కాజ్‌వే వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శరవణ, సాయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు... సీవీసీ పార్కు రోడ్డులో 50 ఏళ్ల వయస్సు కలిగిన నల్లగళ్ల చొక్కా, బ్రౌన్‌రంగు ప్యాంటు ధరించిన వ్యక్తి మృతి చెందాడు. అతను గత కొంతకాలంగా పట్టణంలో సంచరిస్తూ చిత్తు కాగితాలు, ఖాళీ బాటిళ్లు సేకరించి అమ్ముకుని జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

ఆట వివాదంలో దాడి

తడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ ఆటలో జరిగిన చిన్నపాటి గొడవను మనసులో పెట్టుకుని దారి కాచి దాడిచేశారు. మండల పరిధిలోని రామాపురం కుప్పం సమీపంలో ఆదివారం కబడ్డీ పోటీలు జరిగాయి. పలు గ్రామాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ఆరంబాకం నొచ్చుకుప్పం జట్టు, రామా పురం కుప్పం జట్టు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో రామాపురం కుప్పం ఆటగాళ్లు నొచ్చుకుప్పం జట్టు సభ్యులపై దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన నొచ్చుకుప్పం గ్రామస్తులు బుధవారం బుధవారం ఉదయం రామాపురం కుప్పం గ్రామానికి చెందిన జాన్సన్ శ్రీసిటీలో పనులకు వెళ్తుండగా జీరోపాయింట్ దగ్గర దారికాచి దాడి చేశారు. గాయపడ్డ జాన్సన్‌ను చెన్నై ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఇరుగ్రామాల మత్స్యకార పెద్దలు జోక్యం చేసుకుని రెండు వర్గాల మధ్య రాజీ చేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

గాయపడ్డ కూలీ మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. వెంకటాచలం మండలం కసుమూరు గ్రామానికి చెందిన మస్తానయ్య(56) ధాన్యం కాటాల వద్ద కూలిపనుల నిమిత్తం మరో 5 మందితో కలసి నాయుడుపేటకు వచ్చారు. పనులు ముగి సిన అనంతరం మంగళవారం రాత్రి నాయుడుపేట పాతబస్టాండ్ సమీపంలో వెళ్తుండగా మస్తానయ్యను ఆటో ఢీకొంది. గాయపడిన మస్తానయ్యను ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మస్తానయ్య మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు, 20(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని తిరుపతి రూరల్ మండలం హరిపురం కాలనీకి చెందిన బి.కుష్వంత్(13) కనిపించకుండా పోయినట్లు సీఐ చినగోవిందు బుధవారం తెలిపారు. స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి కనబడకుండా పోయినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు 98662 26620, సీఐకి 94910 74525 నెంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

నాసిరకంగా నిర్మిస్తే సహించేదిలేదు : నాని



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం పరిశీలించారు. తొలుతల ఆయన ఎంపీడీవో కార్యాలయ భవన స్లాబ్ పనులను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ హాస్టల్ భవనాల నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలించారు. ఇదేసమయంలో బాలికల హాస్టల్ భవనం వద్ద అపరిశుభ్ర పరిస్థితులను చూసి హాస్టల్ వార్డెన్లను మందలించారు. ఇండోర్ స్టేడియం వద్ద పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత ఉండాలని కాంట్రాక్టరును హెచ్చరించారు. గోవిందధామం పనులను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. తహసీల్దార్ భవనానికి సంబంధించి మిగిలిన 20 శాతం పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో నాని సమావేశమయ్యారు. ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, పీఆర్‌డీఈఈ మురళి, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, రాజులగారి వినోద్, కొండూరు ప్రవీణ్‌రాయల్, పులికంటి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.2 కోట్ల ఎర్రచందనం పట్టివేత



ఎర్రచందనాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరుజిల్లా కావలి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.2 కోట్ల విలువ చేసే 83 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, లారీని సీజ్ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, కావలి టూటౌన్, వన్‌టౌన్, రూరల్ పోలీసుల సహకారంతో మంగళవారం రాత్రి నుంచి విజయవాడ-చెన్నై రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు, ఒక లారీ అటువైపు వేగంగా వచ్చాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించిన రెండు కార్లు యూటర్న్ చేసుకుని వెనక్కి వెళ్లిపోయాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులపైకి లారీ దూసుకురాగా.. అప్రమత్తమైన సిబ్బంది తప్పించుకుని లారీని వెంబడించారు. లారీలోని వ్యక్తులు దూకి పారిపోగా ఒకరిని పట్టుకోగలిగారు. ఆ స్మగ్లర్ హరియాణాకు చెందిన వాడిగా విచారణలో తేలింది. లారీలో పరిశీలించగా 83 ఎర్రచందనం దుంగలు లభించాయి. రెండున్నర టన్నుల బరువున్న ఈ దుంగల విలువ రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. పట్టుబడ్డ స్మగ్లర్‌ను దుంగల సహా లారీని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



జపాన్ బృందానికి శ్రీసిటీ గురించి వివరిస్తున్న శివశంకర్

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎలక్ట్రికల్ వాహన తయారీ సంస్థ బీఈఎంఏసీ జనరల్ మేనేజర్ తకాహిరో ఇన్నామి నేతృత్వంలో జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు ఉన్న అనుకూల విధానాలను వివరించి వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సహకాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాలపై వివరించారు. పర్యటనపై స్పందించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎహైమ్ రాష్ట్ర ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించారు. శ్రీసిటీలో ఎహైమ్‌కు చెందిన యూనిచార్మ్ పరిశ్రమతో సహా 35కు పైగా జపాన్ పరిశ్రమల ఏర్పాటుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత వాతావరణం, జపనీస్ సంస్థలతో భాగస్వామ్యం పట్ల ఇన్నామి ప్రశంసించారు. కాలుష్య రహిత పర్యావరణ వ్యవస్థకు దోహదపడే రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు.

ఎవరినీ కొట్టలేదు.. తిట్టలేదు

- నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు వెళుతుంటే అరెస్టు చేశాం
- పోలీసులపై ఆరోపణలు సరికాదన్న సీఐ

చంద్రగిరి, ఆగస్టు, 20(ఆంధ్రజ్యోతి): 'ఓ రాజకీయ పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలను శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు మార్గంలో కొట్టలేదు.. తిట్టలేదు. మాపై ఆరోపణలు చేయడం తగదు' అని చంద్రగిరి ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎంపీ మిథున్ రెడ్డి ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా బెయిల్ రావాలని ఆపార్టీకి చెందిన కొంతమంది పీలేరు నుంచి తిరుమలకు వెళ్లడానికి పాదయాత్రగా వచ్చారు. ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు 30 మంది గుంపుగా పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు వాహనాలకు కట్టుకొని వచ్చారు. వారిని పోలీసులు ఆపి రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు పట్టుకొని తిరుమలకు వెళ్లరాదని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించకూడదని తెలిపారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం, అనుమతిలేకుండా గుంపుగా శ్రీవారిమెట్టు మార్గంలో వెళుతుండగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించేందుకు ముందస్తుగా అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశాం. అంతేగానీ పోలీసులు పార్టీ పరంగా అడ్డుకొనడం కానీ, కొట్టడంగానీ చేయలేదు. కావాలని పోలీసులపైన నిందలు వేయటం తగదు' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి కొండేశ్వర ఆలయంలో బుధవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కార్తీకేషన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతామూర్తులకు ఉదయం అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, చందనం, పన్నీరుతో అభిషేకాలు చేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ పుష్పాలతో నందీశ్వరుడిని దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి కుంభ హారతి, నక్షత్ర హారతి, హారతులు చేపట్టారు. మరగదాంబికా సమేత వాల్మీకేశ్వర స్వామివార్లకు ప్రాకారోత్సవం నిర్వహించారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.67 కోట్లు



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,67,32,780 లభించింది. బుధవారం స్వామి కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ ఆదాయంలో 50 గ్రాముల బంగారు, 1,617 గ్రాముల వెండితో పాటు 397 యూఎస్ఏ, 105 కెనడా, 70 ఆస్ట్రేలియా, 5 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లాండు పౌండ్లు, 230 యూఏఈ దిర్హామ్స్, 325 యూరోలు, ఒక మలేషియా రింగిట్స్, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.16,236, నిత్యాన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.41,450 లభించినట్లు ఈవో తెలిపారు. ఆలయానికి ఈ ఆదాయం పూర్తిగా 23 రోజుల్లో లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో సాగర్ బాబు, చిత్తూరు ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న వైసీపీ నేతలు



అఖిలాండం వద్ద వైసీపీ కార్యకర్తలు

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని, ఆయనకు త్వరగా బెయిల్ రావాలని శ్రీవారిని కోరుకుంటూ వైసీపీ కార్యకర్తలు బుధవారం పాదయాత్రగా తిరుమలకు చేరుకున్నారు. వైసీపీ జెండాలతో శ్రీవారిమెట్టు వద్దకు వచ్చేందుకు ప్రయత్నించిన వీరిని మంగళవారం పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్రత్యేక నిబంధనలతో వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ప్రదక్షణ చేస్తామని కార్యకర్తలు చెప్పగా పోలీసులు అంగీకరించలేదు. అనంతరం వారిని తిరుపతికి పంపించారు.

అవినీతి చేసుంటే శిక్షించండి: భూమన

తిరుపతి(జీవకోన), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అవినీతి చేశారంటూ వ్యాఖ్యానించడం కరెక్ట్ కాదని, సీబీఐతో విచారణ చేయించి తప్పు చేసుంటే శిక్షించాలని వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి బుధవారం పేర్కొన్నారు. బజారు రౌడీలా టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. తమ నాయకుడు జగన్, ఆయన శ్రీమతి గురించి మాట్లాడితే తామెలా ఊరుకుంటామని ప్రశ్నించారు.

వ్యక్తికి గాయాలు

నాగలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భారత్ గ్యాస్ సమీపంలో పుత్తూరు-చెన్నై హైవేపై బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. పిచ్చాటూరు మండలం అప్పంబేడు గ్రామానికి చెందిన బాలమురుగన్(28) బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు.

30న కుప్పంలో కృష్ణా జలాలకు సీఎం హారతి

- రెండురోజుల్లో పుంగనూరుకు హంద్రీనీవా నీళ్లు
- ఆంధ్రజ్యోతికి ఎస్ఈ విఠల్‌ప్రసాద్ వెల్లడి



యాతాలవంక వద్ద కాల్వను పరిశీలిస్తున్న సీఈ వరప్రసాద్, ఎస్ఈ విఠల్‌ప్రసాద్

పుంగనూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేది కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా జలాలకు హారతి ఇచ్చి స్వాగతించనున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్ ప్రసాద్ తెలిపారు.తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్‌ఇంజనీర్ ఎంఎల్ఎన్ వరప్రసాద్‌తో కలిసి పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలోని యాతాలవంక, నేతిగుట్లపల్లె ప్రాంతాల్లోని హంద్రీనీవా కాలువ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విఠల్ ప్రసాద్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ అనంతపురం జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి బుధవారం నాటికి 120 కిలోమీటర్లు ప్రవహించిన నీళ్ల గురువారం మదనపల్లె చేరుతాయన్నారు. పుంగనూరు, పలమనేరు దాటి కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువుకు హంద్రీనీవా జలాలు ఈనెల 26వ తేది లోపు చేరుతాయని వివరించారు. గతంలో కాల్వలు సక్రమంగా లేకపోవడం, లైనింగ్ తదితర సమస్యలతో నీరు పారే పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రత్యేక చొరవతో పుంగనూరు బ్రాంచికెనాల్‌లో 135 కిలోమీటర్లకు రూ.360 కోట్లు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు రెండు ప్యాకేజీలుగా 130 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.170 కోట్లు మంజూరు చేయడంతో కాల్వ విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం కృష్ణాజలాలతోబాటు శ్రీశైలం నీరుకూడా వేగంగా చెర్లోపల్లె రిజర్వాయర్‌కు వస్తున్నట్లు చెప్పారు. చెర్లోపల్లెలో 1.08టీఎంసీలు నిల్వ చేసి కాల్వలకు నీరు ఇస్తామన్నారు. మూడులిఫ్టుల పంపింగ్ సిస్టమ్ ద్వారా నీరు గంటకు 2కిలోమీటర్లు పారుతోందని వివరించారు.తొలివిడతలో చివర ప్రాంతమైన పరమసముద్రం చెరువులో 21 ఎంసీఎఫ్‌టీ నీరు ఉంచి కుప్పం నియోజకవర్గంలోని 62 చెరువులు, పలమనేరులో 48 చెరువులు మొత్తం 110 చెరువులకు నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. తర్వాత పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని చెరువులకు నీళ్లు ఇస్తామన్నారు.

ట్రాఫిక్ పోలీసు అవుట్ పోస్టు ప్రారంభం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల చెంతకు ట్రాఫిక్ పోలీసులు నినాదంతో తిరుపతిలో మరో అవుట్ పోస్టును ప్రారంభించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద బుధవారం ఎస్పీ హర్షవర్ధన రాజు దీన్ని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులకు అవగాహన కల్పించడానికి అనౌన్స్‌మెంటు సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటూ వాహనదారులకు అవసరమైన సేవలు అందిస్తారని చెప్పారు. అనంతరం ఆటోవాలాలకు స్వీట్లు పంపిణీ చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రవికుమార్, రామకృష్ణమాచారి, సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కరనాయక్, సుబ్బురామిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు, ఎస్పీ ప్రతినిధి రాఘవ పాల్గొన్నారు.


ట్రాఫిక్ అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

వైభవం.. ఉట్లోత్సవం

తిరుమాడ వీధుల్లో గోవిందరాజ స్వామి విహారం


తిరుమాడ వీధుల్లో గోవిందరాజ స్వామి ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. గోకులాష్టమి అయిన మూడో రోజు చిన్నవీధి, నాలుగో రోజు పెద్దవీధి ఉట్లోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం పెద్దవీధి ఉట్లోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో గోవిందరాజస్వామి, శ్రీకృష్ణుని ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం చప్పరంపై గోవిందరాజ స్వామిని, పల్లకిలో శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగింపునకు తీసుకొచ్చారు. ఆలయం నుంచి కర్ణాల వీధి గుండా భేరి వీధిలోని వరదరాజులస్వామి ఆలయం వద్దకు ఊరేగింపు చేరుకుంది. ఇక్కడి ఆలయంలో ఉత్సవర్లను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇక్కడ ఉట్లోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లు ఊరేగింపుగా గాంధీ రోడ్డు నుంచి నాదముని వీధిలోని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పరవశించిపోయారు. అనంతరం ఉత్సవర్లు నాలుగుకాళ్ల మండపం చేరుకుని పూజలందుకున్నారు. తర్వాత భక్తాదులకు దివ్యదర్శనమిస్తూ ఆలయానికి చేరుకున్నారు.

నేడు వెంకన్నకు వేడుకోలు


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి ప్రకాష్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా దీక్షలు చేస్తున్నా టీటీడీ అధికారులు పట్టించుకోవడం లేదని, అందుకే గురువారం పరిపాలన భవనం వద్ద వెంకన్నకు వేడుకోలు కార్యక్రమం చేపట్టనున్నామని శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ శ్రీవారి మెట్టు వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న 30 మందిని టీటీడీ అధికారులు ఖాళీ చేయించడంతో జీవనం కష్టమవుతోందన్నారు. సమస్య పరిష్కారం కోసం ఏడాదిగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణ మన్నారు. అందుకే కుటుంబ సభ్యులతో కలిసి వెంకన్నకు వేడుకోలు కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ప్రకాష్, పెంచలయ్య, యుగంధర్, చిరంజీవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న లక్ష కుంకుమార్చన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 6 నుంచి 12 గంటల వరకు కామాక్షి అమ్మవారికి కుంకుమార్చన ఉంటుందని పేర్కొన్నారు. పాల్గొనే భక్తులు రూ.200 టిక్కెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ఇద్దరికి ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడుతున్న 21 మంది ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. రూ.10వేలు చొప్పున రూ.2.10 లక్షలు జరిమానా విధించారు.

డాక్టరేట్ ప్రదానం


ప్రేమ్‌చంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సివిల్ ఇంజినీరింగ్ పరిశోధకుడు ఎంఎం ప్రేమ్‌చంద్ డాక్టరేట్ పొందారు. బిహేవియర్ ఆఫ్ సెల్ఫ్ కంపాక్టింగ్ కాంక్రీట్ ఆన్ అడిషన్ ఆఫ్ సప్లిమెంటరీ సెమెంటీనియస్ మెటీరియల్స్ ఇన్ ఓపీసీ, పీపీసీ, పీఎస్‌సీ సిమెంట్స్ ఎట్ డిఫరెంట్ డురేషన్స్ ఆఫ్ మిక్సింగ్ అంశంపై ప్రొఫెసర్ రమణారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీతః రాజమాణిక్యం తెలిపారు.

రామానాయుడు పాఠశాలకు ఐడీబీఐ వితరణ

రూ.1.15 లక్షల వస్తువులను అందజేసిన బ్యాంకు అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న కుమార్, పాల్గొన్న దాతలు, అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు తిరుపతి ఐడీబీఐ పలు పరికరాలను వితరణగా అందజేసింది. బ్యాంకు ఏజీఎం శ్యాంసుందర్ రూ.1.15 లక్షల విలువైన కంప్యూటర్, బీరువా, అల్మైరాలు, టేబుల్‌ను డీఈఓ కేవీఎన్ కుమార్ ద్వారా అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఐడీబీఐ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ పల్లి సురేష్, రాజేష్, జిల్లా ఐటీసెల్ ధనుంజయులు నాయుడు, భవిత కోఆర్డినేటర్ చంద్రశేఖర్, క్లస్టర్ హెచ్ఎం టి.వరంధామనాయుడు, పాఠశాల హెచ్ఎం హేమాద్రిబాబు పాల్గొన్నారు.

మాలతీ చందూర్ సాహిత్యంపై నేడు ధర్మనిధి సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత రచయిత్రి మాలతీ చందూర్ సాహిత్యంపై పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో గురువారం ధర్మనిధి సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరీ సెమినార్ హాల్లో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సోషియల్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ వాణి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించనున్న ఈ సదస్సులో పలువురు ప్రసంగించనున్నారు. సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని సదస్సు డైరెక్టర్ డాక్టర్ వై.సుభాషిణి కోరారు.

సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌కు సన్మానం


ఎమ్వీఎస్ఎన్ రాజును సత్కరిస్తున్న ఆనంద గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ ఎమ్వీఎస్ఎన్ రాజును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ విజయవాడలో కలిసి శ్రీవారి ప్రసాదం, శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా గత ప్రభుత్వ హయాంలో శాసనమండలిలో రాజు రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. టీడీపీ, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న అంకిత భావాన్ని ప్రభుత్వం గుర్తించి సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌గా నియమించిందని ఆనందగౌడ్ పేర్కొన్నారు.

చెల్లాచెదురుగా పాదరక్షలు


ముఖద్వార మండపం ముందు చెల్లాచెదురుగా పాదరక్షలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పాదరక్షలు ఎక్కడబడితే అక్కడ వదిలేస్తున్నారు. ఆలయంలోకి వెళ్లే ముఖ మండపం వద్దే విడిచిపెడుతున్నా పట్టించుకునే వారు లేకుండాపోయారు. చెప్పులు భద్రపరుచుటకు బయట ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉన్నా కొంతమంది పట్టించుకోకుండా నేరుగా నమ్మాళ్వార్ సన్నిధి దాటుకుని ముఖమండపం వద్దకు చేరుకుని క్యూలైన్ల వద్ద విడిచిపెడుతున్నారు. ఇలా విడిచిన చెప్పులు చెల్లాచెదురుగా ఉంటున్నాయి. ఒక్కో సందర్భంలో క్యూలైన్లలోకి కూడా చేరుకుంటున్నాయి. భక్తులు వీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆలయాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సీకాంలో ఫొటోగ్రఫీ సెషన్


మాట్లాడుతున్న వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ

తిరుపతి(విద్య), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి సీకాం డిగ్రీ కళాశాలలో బుధవారం ఫొటోగ్రఫీ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ దీన్ని నిర్వహించారు. ఫొటోగ్రఫీ గురించి విద్యార్థులకు ఆయన కూలంకషంగా వివరించారు. వైల్డ్ లైఫ్, మాక్రో, ప్రొడక్ట్, న్యూబార్న్, ఫుడ్, సెలబ్రిటీ ఫొటోగ్రఫీల గురించి విశదీకరించారు. ఈ సందర్భంగా ఇనేష్ సిద్ధార్థ తీసిన ఫొటోలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఇనేష్ బృందం సభ్యులు ప్రవల్లిక, మనూ కొండేటి, చక్రి, వెంకటముని, దిలీప్, యదువంశి, లహరి ఫ్యాషన్ ఫొటోగ్రఫీపై తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ట్రెండ్స్ విద్యార్థులు


పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మంగళంలోని ట్రెండ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోకిల, జాహ్నవి, భవ్యవైష్ణవి, సుకన్య, తస్విజ, గౌతమ్, జోయల్, వినీత్ జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికయ్యారు. వచ్చేనెల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 16, 17తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్‌రోప్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి ఐదు చొప్పున బంగారు, వెండి, మూడు కాంస్య పతకాలు సాధించారు. కోకిల(9వ తరగతి) మూడు పతకాలు కైవసం చేసుకుని వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచింది. అత్యధిక పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కూడా జిల్లా క్రీడాకారులకే దక్కింది. పాఠశాల హెచ్ఎం కేశవులనాయుడు, పీడీలు సాంబశివరావు, సురేష్, రూపలత క్రీడాకారులను అభినందించారు.

సింగిల్‌విండో పద్ధతిలో వినాయక మండపాలకు అనుమతి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య తదితరులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని తుడా మైదానం వద్ద ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్సులో వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టితో చేసిన వినాయక విగ్రహాలను వాడాలని సూచించారు. సింగిల్‌విండో పద్ధతిలో వినాయక మండపాలకు అనుమతి ఇస్తారని, కార్యాలయంలో సంప్రదించి అనుమతులు పొందాలని కోరారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు, నిర్వహణకు కాల్‌సెంటర్‌ఏర్పాటు చేస్తున్నామని,ఎలాంటి ఫిర్యాదులున్నా సంప్రదించాలని కోరారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 31న నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని కోరారు. కమిషనర్ మౌర్య వినాయకసాగర్‌ను పరిశీలించి, నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభ్యులు నవీన్ కుమార్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్ అన్నా అనిత, సభ్యులు గుండాల గోపీనాథ్, కరాటే శ్రీను, రాజారెడ్డి పాల్గొన్నారు.

దేశంకోసం రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగం : చింతా


రాజీవ్‌గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతా మాట్లాడుతూ అందరికీ విద్య అందించాలనే ఉద్దేశంతో రాజీవ్‌గాంధీ మన రాష్ట్రంలో 35 వేల ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తుండటం అన్యాయమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతి ఇంటికీ రూ. 15 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎస్సీలు కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేయాలనుకుంటే అనుమతి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు బీపీ మిషన్ల పంపిణీ


వాకర్స్‌కు బీపీ మిషన్లు పంపిణీ చేస్తున్న కృష్ణప్రసాద్

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఆరోగ్యం దృష్ట్యా ఉచితంగా బీపీ మిషన్లు అందజేస్తున్నామని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం సరోజినీ దేవి రోడ్డులోని కార్యాలయంలో వాకర్స్ అసోసియేషన్లకు రూ.రెండు లక్షల విలువైన 100 బీపీ మిషన్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌నాయుడు, శివగణేష్, శివారెడ్డి, అనసూయమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.


కంపచెట్ల మధ్య పశువుల నీటితొట్టె

పశువుల నీటితొట్టెకు దారేది..!?

తిరుపతి అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మంగళం నుంచి శెట్టిపల్లె మార్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇటీవల నిర్మించిన పశువుల నీటి తొట్టె చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు శరవేగంగా పెరుగుతూ తొట్టెను కమ్మేశాయి. తొట్టె పూర్తిగా కనిపించకుండా పోయింది. పైగా తొట్టెనిండా నీరు ఉన్నా పాచిపట్టి, వ్యర్థాలతో నిండిపోయి కంపుకొడుతోంది. మరుగవడంతో కొందరు మరుగుదొడ్డి తరహాలో వాడుకుంటున్నారన్నా ఆరోపణలున్నాయి. ఎండకు మూగజీవుల దాహం తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు వృథా అవుతున్నాయని, అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

జోనల్‌స్థాయి క్రికెట్‌కు జిల్లా క్రీడాకారులు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం నుంచి జరగనున్న జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా నుంచి మహిళా క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక హోటల్లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ వారికి బుధవారం జ్ఞాపిక బహూకరించారు. శాలువతో సన్మానించారు. కోచ్‌లు, మేనేజర్లను ఘనంగా సత్కరించారు. ఇటీవల కడప, అనంతపురంలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన పురుష, మహిళా జట్లు విజయం సాధించి, చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. టోర్నీలో అత్యుత్తమంగా రాణించి సీనియర్స్ విభాగాలలో ఏడుగురు మహిళలు, అండర్ 16 విభాగంలో ఎనిమిది మంది పురుషులు, అండర్-19 విభాగంలో నలుగురు పురుషులు ఎంపికయ్యారు. వీరు కూడా త్వరలో జరగనున్న జోనల్‌స్థాయి టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి, కోశాధికారి గిరిప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, సతీష్‌యాదవ్, మురళీయాదవ్, హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్యశ్రీనివాస్, వేణుగోపాల్, శివప్రసాద్, రమణ, ప్రకాష్ పాల్గొన్నారు.



తుడా క్వార్టర్స్‌లో వేగ నిరోధకాల తొలగింపు


స్పీడు బ్రేకర్లను పరిశీలిస్తున్న సచివాలయ అధికారులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మంగళం తుడా క్వార్టర్స్‌లో అనధికార వేగ నిరోధకాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో తుడా క్వార్టర్స్‌లో అనధికార వేగ నిరోధకాలు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్పీడు బ్రేకర్లను పరిశీలించారు. ఇంజనీరింగ్ ప్రమాణాలను అధిగమించి వేసిన వాటి ఎత్తును తగ్గించారు. కొన్నింటిని తొలగించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

క్యాడెట్ల సౌకర్యాల కల్పనకు కృషి

ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్


నర్సింగ్ సైలానీకి గౌరవ వందనం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రూప్ పరిధిలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఎన్‌సీసీ ఏపీ-టీజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ పేర్కొన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును బుధవారం ఆయన సందర్శించారు. రాయలసీమ ప్రాంతంలో ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ, ఎన్‌సీసీ గ్రూపుల పరిపాలన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. క్యాడెట్లు, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు మెరుగుపరిచి ప్రత్యేక శిబిరాలు, శిక్షణ, సాహస యాత్రలు, కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడతామన్నారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ సతీందర్ దహియా, సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

విష్ణునివాసం క్యూలైన్లకు పైకప్పు ఏర్పాటు


క్యూలైన్లపై పైకప్పు ఏర్పాటు పనులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక విష్ణునివాసంలోని ఎస్ఎస్‌డీ క్యూలైన్ల వద్ద పైకప్పు ఏర్పాటు పనులు చేస్తున్నారు. పైకప్పు లేక వర్షంలో తడుస్తూ ఎస్ఎస్‌డీ టిక్కెట్ల క్యూలైన్లలో భక్తులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో రెండు రోజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన టీటీడీ అధికారులు, పాలకమండలి క్యూలైన్ల వద్ద రూఫింగ్ పనులు చేపట్టారు. ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి, పైకప్పు షీట్లు వేయడానికి అవసరమైన పనులు చేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. టీటీడీ స్పందన పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన విశ్వశాంతి మహాయాగం





తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన సంగోపాంగ శ్రీశ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. 32 మంది వేదపండితుల సమక్షంలో వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ సంజయ్ కరోల్

తిరుచానూరు, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,033

తలనీలాలు సమర్పించినవారు: 26,905

స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి ఈసారైనా బ్రేక్ పడేనా?

- మెడికల్ మాఫియాకి యంత్రాంగం అండ
- మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాని వైనం
- నేడు నాలుగోసారి తెరవనున్న టెండరు

పులివెందుల పెత్తనం నుంచి స్విమ్స్ ఇప్పటికీ బయటపడడంలేదు. కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా వారి హవా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ అధీనంలోకి స్విమ్స్ వచ్చీ రాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులు పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపులను కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎట్టకేలకు ఒక షాపును రద్దుచేయగలిగారు. అయితే



శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద మెడికల్ షాపు

స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద పులివెందులకు చెందిన వ్యక్తుల చేతిలో ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోతున్నారు. కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించారు. ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు నెలకు రూ.15లక్షలకు పైగా అద్దెవచ్చే అవకాశం ఉన్న షాపును నామమాత్రపు అద్దెతో కేటాయించడంపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం టీటీడీ మూడు సార్లు టెండర్లు పిలిచింది. కానీ, టెండరులో పాల్గొనేందుకు ఎవరూ ముందుకురాలేదు. రూ.25లక్షల అద్దెతో పాటు రూ.25కోట్ల టర్నోవర్ ఉండాలని అసాధారణ నిబంధనలు పెట్టడంవల్లే ఎవరూ ముందుకు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. పులివెందులకు చెందిన వైసీపీ బ్యాచ్‌కు అనుకూలంగా కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా అసాధారణ అంశాలు చేర్చడం వలనే టెండర్లలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదని టీడీడీ ఆలస్యంగా గ్రహించింది. ఈక్రమంలో టర్నోవర్‌ను మాత్రం రూ.25కోట్లు ఉంచి నెలవారి అద్దెను రూ.25లక్షల నుంచి రూ.15లక్షలకు తగ్గిస్తూ గతనెల 25వ తేదీ టీటీడీ నాలుగోసారి టెండరు నోటిఫికేషన్ ఆహ్వానించింది. నెలకు రూ.15లక్షల అద్దెతో టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తిచూపుతున్నారు కానీ రూ.25కోట్ల టర్నోవర్ నిబంధన అడ్డుగామారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తిరుపతిలో రెండు, మూడు రిటైల్ షాపులు మినహా తక్కిన షాపులవారికి రూ.25కోట్ల టర్నోవర్ ఉండడం అసాధ్యం. అందుకే తెలంగాణనుంచి పలువురు టెండర్లలో పాల్గొన్నట్టు తెలిసింది. కాగా బుధవారం టెండర్లు తెరవాల్సివుండగా గురువారానికి వాయిదా వేస్తున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈసారైనా టెండరు విజయవంతమవుతుందో లేదో వేచిచూడాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెలలో బీవీఎస్సీ తరగతులు ప్రారంభం

తిరుపతి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలో యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల్లో ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు ప్రాతిపదికన అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈఏపీసెట్ ద్వారా 85శాతం, వీసీఐ కోటా కింద(నీట్ ర్యాంకు ఆధారంగా)15శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. రైతు కోటా ద్వారా 25శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. స్థానికతకు సంబంధించి న్యాయస్థానంలో తీర్పు వెలువడిన నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన ఈవారంలో పూర్తికానుందని వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య తెలిపారు. కోర్సులో చేరేందుకు దాదాపు 6వేలమంది దరఖాస్తు చేశారు.

ఎన్నారై కోటాకు ప్రతిపాదన

వర్సిటీలో 13ఏళ్ల కిందట ఎన్నారై కోటా రద్దయింది. బోర్డు ఆదేశాల మేరకు ఈ కోటా పునరుద్ధరణకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. తద్వారా వర్సిటీలో 45సీట్లకు అవకాశముంటుంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈసీట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.కోటి వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. కాగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ఒక్కో కళాశాలలో 70సీట్లు ఉన్నాయి. ఐదున్నరేళ్లలో నాలుగున్నరేళ్ల కళాశాలలో విద్యాబోధన సాగుతుంది. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో క్షేత్రస్థాయిలో పశువైద్య ఆసుపత్రుల్లో పనిచేయాలి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండు



ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య

బీవీఎస్సీ కోర్సులు చదివిన వారికి వివిధరంగాలలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్), పౌల్ట్రీ, డెయిరీ, ఫార్మాస్యుటికల్ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ ప్రాక్టీస్ ద్వారా ఉపాధి. ఆలిండియా స్థాయిలో వెటర్నరీ ప్రాక్టీగా పనిచేయొచ్చు. ప్రత్యేకించి విదేశాలల్లో వెటర్నేరియన్స్‌కి డిమాండ్ ఉంది. ప్రతిష్టాత్మక యూపీఎస్సీ ఏపీపీఎస్సీలలో రాణించేందుకు వెటర్నరీవిద్య దోహదం చేస్తుంది.

- డాక్టర్ వీరబ్రహ్మయ్య, వెటర్నరీ డీన్

55 ఏళ్ల భూవివాదానికి పరిష్కారం

- అటవీశాఖకు భూములు తిరిగి అప్పగింత
- బాధిత రైతులకు మరోచోట పట్టాలిచ్చేందుకు ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఇనగలూరు రెవెన్యూ పరిధిలోని సింహాచలకండ్రిగ, గొల్లపల్లి పంచాయతీల్లో 55 ఏళ్ల అటవీ భూముల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. అక్కడి రైతులతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు, సింహాచలకండ్రిగ రైతులతో బుధవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. చర్చల వివరాలను విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. 1970లో అప్పటి ప్రభుత్వం 130 ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అయితే ఈ భూమి రిజర్వు ఫారెస్టు కావడంతో 1978లో అప్పటి కలెక్టర్ రద్దు చేశారన్నారు. తరువాత 1998లో 98 కుటుంబాలకు 130 ఎకరాల భూమి పంపిణీ చేస్తూ పట్టాలు జారీచేశారన్నారు. 2008లో అటవీశాఖ అధికారులు మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈక్రమంలో 2014లో న్యాయస్థానం ఈ భూములను అటవీశాఖవిగా గుర్తించి పట్టాలను రద్దు చేసినట్లు వివరించారు. ఇలా 55 ఏళ్లుగా అటవీశాఖ, సింహాచలకండ్రిగ గ్రామస్థుల మధ్య వివాదం నలుగుతూనే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తితో తాను వచ్చి రెవెన్యూ, అటవీశాఖ, రైతుల సమక్షంలో చర్చించినట్లు తెలిపారు. అటవీ భూములను తిరిగి ఆ శాఖకు అప్పగించి బాధిత రైతులకు సమీప ప్రాంతంలో సాగుకు అనువైన భూములను కేటాయిస్తామన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అటవీశాఖ స్వాధీనం చేసుకుంటున్న భూమిలో నీలగిరి తైలం మొక్కలను పెంచి వనసంరక్షణ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రతి మూడు, నాలుగేళ్లకోసారి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ నిర్ణయాలకు



హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

రైతులు అంగీకరించి హర్షం వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సింహాచలకండ్రిగతో పాటు బీవీపురం, గొల్లపల్లి గ్రామాల్లో నెలకొన్న 1,150 ఎకరాలకు సంబంధించి భూవివాదాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేకాట ఆడుతున్న జూదరులు

డ్రోన్‌కు చిక్కిన జూదరులు

- 11మంది అరెస్టు.. 9 మంది పరారీ
- రూ.2,36,740, 12సెల్‌ఫోన్లు, 4 బైక్‌లు స్వాధీనం

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కింద పట్ట పరిచారు. ఒక పక్క పరదా కట్టారు. ఇలా రోడ్డుకు దూరంగా పొలాల్లో పేకాట స్థావరం పెట్టారు. ఎక్కడో పొలాల్లో ఉన్న తమను ఎవరు పట్టుకుంటారులే అని ధీమాగా పేకాట ఆడుతున్న వారు.. ఆకాశం నుంచి నిఘా పెట్టిన డ్రోన్‌కు చిక్కారు. ఏర్పేడు మండలం మేర్లపాక, బండారుపల్లి, ముసలిపేడు, కందాడు, రామలింగాపురం గ్రామాల్లో డ్రోన్ ద్వారా పోలీసు బీట్ పెట్టారు. సైబర్ క్రైం సీఐ, డ్రోన్ కెమెరాల ఇన్‌ఛార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పది మంది పోలీసులు పేకాట స్థావరాలపై డ్రోన్ నిఘా పెట్టారు. బండారుపల్లి, ముసలిపేడు సరిహద్దు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట ఆడుతున్న మూడు ప్రాంతాలపై దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారయ్యారు. పేకాట స్థావరాల నుంచి రూ.2,36,740 నగదు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన ఇద్దరు, కడపకు చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరుకు చెందిన ఒకరు, కలకడకు చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వీరిని ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

'పుష్పిత్ స్టీల్స్'లో కార్మికుడి మృతి

- కర్మాగారం ఎదుట మృతుడి బంధువుల ధర్నా



పరిశ్రమ వద్ద బంధువుల ధర్నా



మహేష్ ఫైల్ ఫొటో

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలోని 'పుష్పిత్ స్టీల్స్'లో మెకానిక్‌గా పనిచేస్తున్న మేర్లపాక వాసి మహేష్(45) బుధవారం మృతిచెందారు. విధినిర్వహణలో ఉన్న ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో హుటాహుటిన కంపెనీ వాహనంలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు యాజమాన్యం తెలిపింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, తీవ్ర పని ఒత్తిడి వల్లే కర్మాగారం లోపలే మహేష్ చనిపోయాడని, బతికి ఉన్నట్లు ఆస్పత్రికి తీసుకెళ్లి యాజమాన్యం నాటకాలు ఆడారని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. కర్మాగారంలోని పెద్ద కీలన్‌పైకి బలవంతంగా ఎక్కించారని, అక్కడ ఆయన చనిపోయినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో న్యాయం కావాలని, మహేష్ మృతికి కారణమైన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మృతదేహంతో పుష్పిత్ స్టీల్స్ ఎదుట బంధువులు, గ్రామస్థులు ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భద్రత కల్పించాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డిసెంబరులోగా కొత్త భవనం అప్పగించండి

- రైల్వే జీఎం సంజయ్ కుమార్ ఆదేశం

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని ఈ ఏడాది డిసెంబరులో అప్పగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వేస్టేషన్‌లో చేపట్టిన నిర్మాణాల ప్రణాళికను పవర్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం అధికారులతో సమీక్షించాక సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను అప్పగించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, జోనల్ సీఈ సూర్యనారాయణ, కార్యదర్శి మల్లాడి శ్రీనివాస్, సీనియర్ స్కేల్ అధికారులు సుదర్శన్‌రెడ్డి, మనికంఠ, మనోజ్, శ్రావణ్ కుమార్, సూర్యనారాయణ, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా జీఎంను రాజస్థానీ బ్రాహ్మణ్ మహాసభ నాయకులు కలిశారు. తిరుపతి-బికనీర్‌ల మధ్య రెగ్యూలర్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైల్వే కూలీలు వినతి పత్రం సమర్పించారు. డీఆర్ఎంతో జీఎం మాట్లాడి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్టేషన్ అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఆయన ప్రత్యేక కోచ్‌లో సికింద్రాబాద్ బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఉదయం రైల్వేజీఎం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



రైల్వేస్టేషన్ భవన నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

ఎర్రచందనం దుంగల స్వాధీనం



బోడేవాండ్ల పల్లెవద్ద పట్టుబడిన వాహనాలతో పాటు ఎర్రచందనం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లెవద్ద ఎర్రచందనం స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. బోడేవాండ్లపల్లెవద్ద టీ జంక్షన్ వద్ద బుధవారం వేకువజామున ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక వ్యాను అతివేగంగా వెళ్లడం ఫారెస్ట్ సిబ్బంది గమనించారు. వెంటనే నిలువరించేందుకు వేగంగా వెంబడించారు. దీంతో నిందితులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి పరారయ్యారు. సిబ్బంది వాహనాలను పరిశీలించగా 395 కేజీల బరువు గల 10 ఎర్రచందనం దుంగలున్నాయి. వాహనాలతో దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మన్ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ నర్సింగ్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ శిక్షణ ఉంటుందని ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉచిత వసతితోపాటు శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి బాలా వీరాంజనేయస్వామి పాల్గొంటారన్నారు.

విద్యుత్ స్తంభాలకు అనధికార కేబుల్స్ తొలగించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతోపాటు టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ స్థంభాలకు అనధికారంగా వున్న కేబుల్ వైర్లను తొలగించాలని లేదంటే తమ సిబ్బంది శనివారం నుంచి తొలగిస్తారని సదరన్ డిస్కం ఈఈ వి.చంద్రశేఖర్ రావు బుధవారం స్పష్టంచేశారు. విద్యుత్ స్తంభాలకు ఇబ్బడి ముబ్బడిగా అనధికార కేబుల్ వైర్లు ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు కేబుల్ ఆపరేటర్లుకు వైర్లు తొలగించాలని కోరామన్నారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి కఠినమైన నిర్ణయాలు తీసుకొంటున్నామని వెల్లడించారు. వినాయకచవితి మండపాల నిర్వాహకులు రుసుం చెల్లించి తాత్కాలిక విద్యుత్ సర్వీసులను పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఈపీతో సత్వర అభివృద్ధి

- హెచ్‌సీయూ మాజీ వీసీ పొదిలి అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 అమలుతో దేశం సత్వర అభివృద్ధి సాధిస్తుందని హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు పేర్కొన్నారు. ఐదేళ్ల ఎన్ఈపీ అమలు - ప్రగతి అంశంపై అఖిల భారతీయ శిక్షక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 37 ఏళ్లుగా దేశ విద్యా విధానంలో ఎలాంటి మార్పులూ తీసుకురాలేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మార్పులు అవసరమని కేంద్ర ప్రభుత్వం భావించిందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ఐటీ, ఫార్మా, అగ్రి, డెయిరీ వంటి రంగాల్లో స్వయం ఉపాధిని కల్పించేలా అనేక నూతన కోర్సులు ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో కేజీ నుంచీ పీజీ దాకా ఎన్ఈపీ పటిష్టంగా అమలు అవుతుందన్నారు.తద్వారా విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ దేశాల్లో ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్య వరకూ అంతా మాతృభాషలోనే విద్య అందిస్తున్నారని,మన దేశంలోనూ ఇదే తరహా బోధన అందించే అవకాశాన్ని ఎన్ఈపీ కల్గించిందని అన్నారు. విద్యకు బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వాణి, విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

- ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ
- శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సులు ఫుల్

- ఫుట్‌పాత్ మీద ప్రమాదం అంచున ప్రయాణాలు



బస్సు వెలుపల రద్దీ



బస్సులోపల రద్దీ

పుత్తూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో పల్లెవెలుగు బస్సులన్నీ లోపల బయటా నిండిపోతున్నాయి. ఫుట్‌పాత్ ప్రయాణంతో ప్రమాదం అంచున నడుస్తున్నాయి. ప్రత్యేకించి కళాశాలలు, కార్యాలయాల ముగింపు వేళల్లో అదుపు చేయలేని రద్దీతో బస్సులు కదులుతున్నాయి. సత్యవేడు, నగరి, చిత్తూరు మార్గాల్లో గతంలో ఆటోల్లో వెళ్లే మహిళలు ఇప్పుడు ఓపికతో వేచి వుండి పల్లెవెలుగు బస్సులు ఎక్కుతున్నారు. రోజురోజుకూ ఆక్యుపెన్సీ రేటు పెరుగుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో అదనపు సర్వీసులను నడపాలని మహిళలు కోరుతున్నారు.

- డెప్యుటేషన్‌పై వెటర్నరీ వర్సిటీకి

వెంకటగిరి పశువైద్య ఏడీ బదిలీ

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంవీ స్వామిబాబు డెప్యుటేషన్‌పై తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడాది పాటు ఆయన కొనసాగనున్నారు. వర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ వెటర్నరీ ఎడ్యుకేషన్‌లో గానీ లేదా తిరుపతిలోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా గానీ ఆయన సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం వర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

మరో 24 మందికి టీడీఆర్ బాండ్లు

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 24 మందికి టీడీఆర్ బాండ్లను బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అందజేశారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని తెలిపారు. పలుమార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. కాగా బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో మురళీకృష్ణ, తహసీల్దార్ గోపినాథరెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యయసాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మురళీకృష్ణ, తహసీల్దార్ గోపినాథరెడ్డి, సీడీపీవో జ్యోతి కిరణ్, వైద్యాధికారిణి జయశ్రీ, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సత్యనారాయణ, భవాని తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం మోహిత్

గూడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్‌ను విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ బుధవారం పరిశీలించారు. ప్లాట్‌ఫామ్‌లు, పడమర వైపు టిక్కెట్ బుకింగ్ కేంద్రాన్ని, ప్రయాణికుల నిరీక్షణ గదులను తనిఖీ చేశారు. అనంతరం రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తూ గూడూరు నుంచి కృష్ణపట్నం వెళ్లారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జాతరలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు



పోలేరమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

వెంకటగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) వెంకటగిరి పట్టణంలో వచ్చేనెల 10, 11 తేదీల్లో నిర్వహించే గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు గూడూరు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. బుధవారం ఆమె పోలరమ్మను దర్శించుకొన్నారు. అనంతరం జాతర నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. మల్లమ్మ గుడి వద్ద అమ్మవారి విరూప కార్యక్రమం గురించి తెలుకొని పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు, ఇంజనీర్ బాబు, గొల్లగుంట రాము తదితరులు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకుని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 8498066674 నెంబరును సంప్రదించాలన్నారు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో మూడు బార్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ కోరారు. బుధవారం నాయుడుపేట, సూళ్లూరుపే ఎక్సైజ్ కార్యాలయాల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. సూళ్లూరుపేటలో రెండు, నాయుడుపేటలో ఒక బార్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్, డీపీఈవో కార్యాలయం, ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేష్ ప్రతిమలు - తదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గణనాథులు

సూళ్లూరుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జై బోలో గణేష్ మహరాజ్‌కీ.. జై అని అనేందుకు ఇంకా ఎన్నో రోజులు లేవు. వినాయక చవితి పండగ సమీపిస్తుండటంతో కళాకారులు ప్రతిమల తయారీని వేగవంతం చేశారు. విగ్రహాలను రూపొందించి తుది మెరుగులు దిద్దుతున్నారు. రెండు అడుగుల ఎత్తు మొదలుకొని తొమ్మిది అడుగుల ఎత్తు వరకు లంబోదరుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కొన్ని రోజుల ముందే కొంత నగదు అడ్వాన్స్ ఇచ్చి తమకు నచ్చిన ఆకృతిలో విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు సూళ్లూరుపేటలో జాతీయ రహదారి పక్కన గోదాముల్లో వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈనెల 27న వినాయక చవితి పండగను పురస్కరించుకొని ఇప్పటి నుంచే ఉత్సవ కమిటీలు విగ్రహాల తయారీ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సహకార సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండల్లాలోని సింగిల్ విండోల అధ్యక్షులుగా పప్పు చంద్రమౌళిరెడ్డి, గొల్లగుంట వెంకటముని, గుత్తికొంట బాబు నాయుడు, పులి జనార్దనరెడ్డి, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, చైతన్య ప్రసాద్‌రెడ్డి, నల్రావుల భాస్కర్‌నాయుడు, రంగినేని మునిరాజా, రాయి సత్యం, దాసరి ప్రభాకర్‌నాయుడు, సింగంశట్టి భాస్కర్‌రావు, ఆది వెంకటకృష్ణారెడ్డి సాముహికంగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారని నడిపిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలను దోచుకున్నారని ఆరోపించారు. సంఘాలు ద్వారా సకాలంలో రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చుకొని ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఇక అలా జరగడానికి వీల్లేకుండా సహకార సంఘాలు సకాలంలో రుణాలు అందజేయాలని సూచించారు. రైతులు కూడా తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ 2014-19లో తాను చైర్మన్‌గా పనిచేసినప్పుడు సెంట్రల్ బ్యాంకును లాభాలబాటలో పెట్టడం జరిగిందన్నారు. అలాగే రైతులకు వెయ్యి కోట్ల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని 15 సొసైటీలకు రూ.200 కోట్లు రుణం కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ పునగోటి విధ్వనాధ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పులికొల్లు రాజేశ్వరరావు, గొల్లగుంట మురళీకృష్ణ, బీరం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతుల వద్ద ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిద్ధవరం, యాతలూరు సచివాయాల పరిధిలోని రైతులకు ఈ క్రాప్ పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందకపోతే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. పంట మార్పిడి తరువాత పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే మంచి భూసారం పెరుగుతుందన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు తగు మోదాలో వేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసేప్పుడు డీలరు వద్ద బిల్లులు ఖచ్చితంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లోని వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ అనసూయ, ఏవోలు సుజాత, ప్రవీణ, గ్రామ వ్యవసాయ సహాయకులు గురు బ్రహ్మం, మానస, అశోక్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతోనే రాయితీలు

నాయుడుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ - పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలకు అందుతాయని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. బుధవారం మండలంలోని పుదూరు, పూడేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగుపై రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. రైతులకు జీలగలను అందజేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలి పంచాయతీ జువ్వినట్టు సమీపంలో ఉన్న అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం భూములను కౌలుకు ఇచ్చేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త తిరుమూరు సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. 98.80 ఎకరాలను ఏడాది కాలపరిమితికి రూ.25.95 లక్షలకు దక్కించుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, తూపిలిచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయానికి భూమిపూజ

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి బుధవారం స్థానిక నాగశక్తి పీఠాధిపతి చిదానందస్వామి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకువచ్చి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజారత్నం, సుధాకర్, రమణయ్య, మోహన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో నేడు కలెక్టర్ పర్యటన

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం వాకాడు మండలంలో పర్యటించనున్నారని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ తెలిపారు. వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బాలిరెడ్డిపాళెం వద్ద ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తారని డీటీ చెప్పారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

వాకాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ అన్నారు. మండలంలోని రేషన్ డీలర్లతో బుధవారం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తూకాల్లో మోసం చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

వినాయక ఉత్సవాల అనుమతికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోండి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల అనుమతి కోసం పోలీస్‌శాఖ ప్రత్యేకంగా జీఏఎస్‌ఈఎస్‌హెచ్‌యూటిఎస్ఎవి డాట్‌నెట్ పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఉత్సవాల నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్‌విండో విధానంలో అనుమతి పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీచేసి నిరభ్యంతర పత్రాన్ని జారీ చేయడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మాత్రమే ఈ అనుమతులు పొందాలని తెలిపారు.

పంచాయతీల ఆడిట్

కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి ఆడిట్ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగం, పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

కృష్ణాష్టమి వేడుకలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో బుధవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు ఇస్కాన్ సిటీ సుఖదేవ్ మహర్షి బలీంద్ర బాబు, వర్మప్రభు, చక్రధర్‌బాబు, వర్మప్రభు, కామేశ్వరి, జ్యోతి, సునీత, వేమసాని భారతి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఉట్లోత్సవం
తిరుమాడ వీధుల్లో గోవిందరాజ స్వామి విహారం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో బుధవారం ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. గోకులాష్టమి అయిన మూడో రోజు చిన్నవీధి, నాలుగో రోజు పెద్దవీధి ఉట్లోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం పెద్దవీధి ఉట్లోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో గోవిందరాజస్వామి, శ్రీకృష్ణుని ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం చప్పరంపై గోవిందరాజస్వామిని, పల్లకిలో శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కర్నాలవీధి గుండా భేరివీధిలోని వరదరాజులస్వామి ఆలయం వద్దకు చేరుకున్నాక ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్లోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు... సీవీసీ పార్కు రోడ్డులో 50 ఏళ్ల వయస్సు కలిగిన నల్లగళ్ల చొక్కా, బ్రౌన్‌రంగు ప్యాంటు ధరించిన వ్యక్తి మృతి చెందాడు. కొంతకాలంగా పట్టణంలో చిత్తు కాగితాలు, ఖాళీ బాటిళ్ల సేకరించి అమ్ముకుని జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

గూడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిలిపివేసిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రద్దు చేసిన పింఛన్లను తిరిగి అందిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శశికుమార్, సీవీఆర్‌కుమార్, నారాయణ, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, నాగార్జున, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాల పెంపుపై అవగాహన

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఐఐటీ తిరుపతిలో భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్)తో కలిసి బుధవారం అధ్యాపకుల సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాణీకరణ ప్రాముఖ్యతపై అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ప్రమాణాల అనుభవాన్ని పంచుకుని, ప్రమాణాలపైపూర్తిస్థాయిలో వివరించారు. బీఐఎస్ డైరెక్టర్ చిన్మయ ద్వివేదీ మాట్లాడుతూ 1947నుంచి సాధించిన అంశాలపై బీఐఎస్ కీలకపాత్రను వివరించారు. నోడల్ అధికారి శ్రీధర్‌చీమలకొండ కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాల్లో ప్రమాణాల సృష్టి అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా బీఐఎస్ విద్యార్థి విభాగాన్ని ప్రారంభించారు. సాంకేతిక సెషన్లతో పాఠ్యక్రమ అనుసంధానం, డిజిటల్ ఇనిషియేటివ్స్, ప్రమాణాల రూపకల్పనపై చర్చలు జరిగాయి. చివరగా ఎంవోయూ అమలుకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



ఎంవోయూ కుదుర్చుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, బీఐఎస్ డైరెక్టర్ ద్వివేది

మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



సీఐ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ నేటియువత విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి, వార్డెన్ సుమన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సహాయక చర్యలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు టీడీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు సహాయక చర్యలు అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన హిందూ ఆధ్యాత్మికవేత్త కరుణానంద స్వామి కొందరు సహచరులతో కలిసి తిరుపతి నుంచి బుధవారం సాయంత్రం విజయవాడకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న స్వామీజీతో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. అటువైపుగా వెళుతున్న టీడీపీ నేత మునిరాజా నాయుడు క్షతగాత్రులను కారు నుంచి వెలుపలకు తీసి సహాయక చర్యలు అందించారు. అనంతరం 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఢిల్లీ ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఆహార సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ కమిషనర్ సంజీవ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ముక్కంటిని దర్శించుకున్న హర్యానా మండలాధీశుడు



ఆలయం వద్ద సోము వీర్‌బాబా

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దేశంలోని 18 మండలాధీశుల్లో ఒకరైన హర్యానాకు చెందిన సోమువీర్‌బాబా కాళిదాసు బుధవారం తన శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వినాయకచవితి ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి



అనౌన్స్ చేస్తున్న పోలీసులు

ఏర్పేడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఏర్పేడు పోలీసులు సూచించారు. మండల కేంద్రమైన ఏర్పేడు, పాపానాయుడుపేటలో పోలీసు సిబ్బంది బుధవారం సాయంత్రం మైకుల ద్వారా ప్రచారంచేశారు. వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు చేసే నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ వినాయక ప్రతిమలను పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి తరువాతనే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పిచ్చాటూరులో...

పిచ్చాటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని వీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి అని పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పోలీసు శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. వినాయక మండపాల వద్ద నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పుత్తూరు వార్తలు

వికలాంగుల పింఛన్లు కొనసాగించాలి



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వికలాంగులకు రద్దు చేసిన పింఛన్లు కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని తెలిపారు. వెంటనే రద్దు చేసిన వికలాంగుల పింఛన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ నాయకులు చంద్రబాబు, గోపి, శరవణ, కృష్ణారెడ్డి, రమేష్, వెంకటరత్నం, సెల్వారాజాచారి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరేటమ్మ ఊరేగింపు



పుత్తూరు టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పుత్తూరు జాతరను పురస్కరించుకుని గ్రామదేవత ఆరేటమ్మ తల్లిని వైభవంగా ఊరేగించారు. బుధవారం ఉదయం అమ్మవారికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబలి అభిషేకం చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆరేటమ్మను సుందరంగా అలంకరించి పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ, బాణసంచా పేల్చుతూ ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మామిడి రైతులకు న్యాయం చేయండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం నేత హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తోతాపురి మామిడికి ప్రభుత్వం ప్రకటించినట్లు ధరలను పరిశ్రమలు చెల్లించడం లేదని, ఈ విషయంపై సీఎంను కలిసి పరిశ్రమలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మామిడి రైతులు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. దీనికోసం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని మామిడి మార్కెట్ యార్డులో క్లస్టర్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి మామిడి రైతులు అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

పుత్తూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సబ్ కోర్టులో సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పోలీసులు, కక్షిదారులు జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో వచ్చే తీర్పు అంతిమ తీర్పు అని, దానిపై అప్పీల్ ఉండదని తెలిపారు. లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని, రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



జపాన్ ప్రతినిధుల బృందానికి శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఆర్.శివశంకర్

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎలక్ట్రికల్ వాహన తయారీ సంస్థ బీఈఎంఏసీ జనరల్ మేనేజర్ తకాహిరో ఇన్నామి నేతృత్వంలో జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు ఉన్న అనుకూల విధానాలను వివరించి వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సాహకాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాలపై వివరించారు. పర్యటనపై స్పందించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎహైమ్ రాష్ట్ర ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించారు. శ్రీసిటీలో ఎహైమ్‌కు చెందిన యానిచార్మ్ పరిశ్రమతో సహా 35కు పైగా జపాన్ పరిశ్రమల ఏర్పాటుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత వాతావరణం, జపనీస్ సంస్థలతో భాగస్వామ్యం పట్ల ఇన్నామి ప్రశంసించారు. భారతదేశంలో ఎలక్ట్రికల్ ఆటో రిక్షాలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా భారత్‌లో కాలుష్య రహిత పర్యావరణ వ్యవస్థకు దోహదపడే రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు.

రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై జీఎం ఆరా



రేణిగుంటలో రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

రేణిగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్ ఆరా తీశారు. బుధవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో పర్యటన ముగించుకుని గుంతకల్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తాతో కలిసి రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు రైల్వే ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేణిగుంట రైల్వేస్టేషన్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల మ్యాపులను జీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేసిన రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పెన్షనర్ల సమస్యపై ప్రత్యేకదృష్టి సారించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన ప్రత్యేక కోచ్‌లో సికింద్రాబాద్‌కు బయల్దేరివెళ్లారు. ఏఐఆర్ఆర్ఎఫ్ గుంతకల్లు డివిజన్ ప్రెసిడెంట్ జయంత్ కుమార్, బ్రాంచ్ చైర్మన్ అసన్‌సాహెబ్, సర్పంచ్ నాగేశం పాల్గొన్నారు.

నకిలీ పత్రాలను సృష్టించిన వారిని అరెస్టు చేయాలి

● కేవీపీఎస్ డిమాండ్



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, సీపీఎం నాయకులు

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి భూముల ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సీపీఎం మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాధితులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పేరడంలో మది కుటుంబీకులకు పూర్వీకంగా సంక్రమించిన సొంత భూమిని సిరుణంబుదూరు గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి అటు రెవెన్యూ అధికారులను, ఇటు రిజిస్ట్రేషన్ అధికారులను బోల్తా కొట్టించి తన భార్య పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నాడని తెలిపారు. కుమార్‌పై కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కుమార్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ రెవెన్యూ ధ్రువపత్రాలను సృష్టించిన సూత్రధారిపై ఎఫ్ఐఆర్ వేసి చట్టపరంగా చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేకూరుస్తామని ఎస్ఐ రామస్వామి హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. కార్యక్రమంలో మురళి, కిష్టయ్య, మునస్వామి, అమ్ములు, రోస్లిన్, మది, సుశీల, కొల్లాపురి, వీరమ్మ, లక్ష్మి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ చేసిన సంస్కరణలో భాగమే నేడు టెలి కమ్యూనికేషన్ ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానర్దన్‌రెడ్డి, గోపి, సురేష్, అనిల్, నాగూరయ్య, ఆర్ముగం, నరేంద్ర, భానమ్మ, మస్తానమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు. ● అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు నాగరాజు, సీతారాం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటుకు ఎస్‌బీఐ రాయితీ

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్‌యోజన పథకం కింద ఇళ్లపై సోలార్‌ప్యానల్స్ ఏర్పాటుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రాయితీ ఇవ్వనున్నట్లు ఆ బ్యాంక్ సత్యవేడు మేనేజర్ సూర్యప్రకాష్ తెలిపారు. ఒక కిలో వాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్ రూ.78 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకం గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈవో - 2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆరా తీసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సీఎం సహాయనిధి అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగకు చెందిన వెంకటేశ్వర్లు అన్నమయ్య జిల్లా పుల్లంపేట వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. బుధవారం వారి కుటుంబ సభ్యులకు పట్టణంలోని పీఆర్ అతిథిగృహంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన రూ.3లక్షలు చెక్కును అందజేశారు.

వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

నాగలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి కొండేశ్వర ఆలయంలో బుధవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కార్తికేషన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతామూర్తులకు ఉదయం అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, చందనం, పన్నీరుతో అభిషేకాలుచేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ పుష్పాలతో నందీశ్వరుడిని దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి కుంభ హారతి, నక్షత్ర హారతి, మహా హారతులు చేపట్టారు. ప్రదోష పూజానంతరం ఉత్సవమూర్తులైన మరగదాంబికా సమేత వాల్మీకేశ్వర స్వామివార్లను ముస్తాబు చేసి ఆలయ అవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

నాగలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకాసురులు ఇసుకను తరలిస్తున్నారు. మండలంలోని చిన్నాపట్టు వద్ద అరణియార్ నదిలో మంగళవారం అర్ధరాత్రి 2 గంటలకు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు వెళ్లి మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయకుండా నామ మాత్రంగా జరిమానాలు విధించి ట్రాక్టర్లను విడుదల చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రి వేళలో గట్టి గస్తీ నిర్వహించి, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

వరదయ్యపాళెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. ఎస్ఆర్‌పీ లోకేశ్ ఆధ్వర్యంలో 13 మంది డీఆర్‌పీల బృందం మండల కార్యాలయానికి చేరుకున్నట్లు ఏపీవో గణేష్ తెలిపారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, ఫారెస్ట్, సర్వశిక్షాభియాన్ శాఖలలో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా చేపట్టిన పనులతో పాటు సామాజిక భద్రత పింఛన్‌లపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ జరిపి డ్వామా పీడీ సమక్షంలో నిర్వహించే బహిరంగ సమావేశంలో నివేదికలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తనిఖీ బృందానికి వాస్తవాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

జూనియర్ కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందిస్తున్న దశరథరెడ్డి

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చిత్తూరు జిల్లా వీకోటకు చెందిన అమ్మ స్వచ్ఛంద సంస్థ కంప్యూటర్లను వితరణగా అందించింది. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి అభ్యర్థన మేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు అధినేత దశరథరెడ్డి 5 కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను అధ్యాపకులు రాజేష్‌కుమార్, శివరాంకు అందించారు. అమ్మ ట్రస్టు నిర్వాహకులకు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కాట్రపల్లి ఆలయంలో చోరీ



పొలాల్లో పడేసిన హుండీ, చిల్లర నాణేలు

కేవీబీపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాథస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు హుండీ చోరీ చేశారు. హుండీని సమీపంలోని పొలాల్లో పడవేసి అందులోని నగదు, బంగారం అపహరించుకుపోయారు. ఈ విషయమై ఆలయ ధర్మకర్త కోలా ఆనంద్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల అభివృద్ధే చంద్రబాబు ఆకాంక్ష



మాట్లాడుతున్న గురవారెడ్డి

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం బండారుపల్లిలో బుధవారం నిర్వహించిన మహిళా సంఘాల జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా స్వశక్తితో ఎదగాలని ఆకాంక్షించి, వారికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ముందుకు నడిపించే విధంగా చంద్రబాబు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సంఘమిత్రలు, మునెమ్మ, భాస్కరమ్మ, మహిళా సంఘాల సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గొర్రెలదొడ్డిగా
రైతు భరోసా కేంద్రం..!



రైతు భరోసా కేంద్రంలో గొర్రెలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న రైతు భరోసాకేంద్రాన్ని ఓ వైసీపీ నాయకుడు గొర్రెలదొడ్డిగా మార్చుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ఈశ్వరయ్యకాలనీలో మూడేళ్ల క్రితం రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. అయితే అది గోడల దశలోనే నిలిచిపోయింది. స్థానిక కాలనీకి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఈ కేంద్రాన్ని గొర్రెలదొడ్డిగా మార్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా అదే తంతు కొనసాగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● రూ.2.27 కోట్ల అన్నదాత సుఖీభవ మెగా చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. బుధవారం ముడియూరు రైతు సేవా కేంద్రంలో పేయ దూడల ప్రదర్శన, అన్నదాత సుఖీభవ మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలు ద్వారా కూటమి ప్రభుత్వం రైతు బంధు ప్రభుత్వంగా మారిందని స్పష్టం చేశారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడం ద్వారా వారు ఆనందంగా ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. అనంతరం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పేయ దూడల ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం రైతు సేవా కేంద్ర ఆవరణలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలానికి చెందిన రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు కింద మంజూరైన రూ.2.27 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులు ఉంటే అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివకుమార్, ఏడీ చంద్రశేఖర్, పశు వైద్యాధికారులు మంజుల, స్రవంతి సిబ్బంది చందన, ఉషశ్రీ, అజిత్, నాయకులు పద్మరాజు, వాసురెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, గోపి, బాలాజీ, ప్రేమ్ బాబు, గోవర్ధన్, ఢిల్లీ, సుమాంజలి, రాజేశ్వరి, ఏవో సంజీవరెడ్డి, రైతులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పాడి రైతులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్ ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



రేణిగుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఉన్న ఫలంగా విధులనుంచి తొలగించడంతో బుధవారం సీఆర్ఎస్ ప్రధాన ద్వారం వద్ద వారు నిరసన తెలియజేశారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మునిరాజా మాట్లాడుతూ సీఆర్ఎస్‌లో డైనమిక్ ఎంటర్‌ప్రైజెస్ తరఫున ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడంతో మిగిలిన కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌తో చర్చించి అందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటంలోకి దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు సర్వరాజ్, ఈశ్వరి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొలగించిన వికలాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నుంచి ఇస్తున్న పింఛన్లు కూడా తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి వికలాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. లేని పక్షంలో బాధితులతో కలిసి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, నాయకులు మురళి, జనార్ధన్, మునిరాజా, మునెమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: దివ్యాంగులకు రద్దు చేసిన పింఛన్లు పునరుద్ధరించాలని సీపీఐ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తదితరులు ఎంపీడీవో వెంకటరత్నమ్మకు వినతిపత్రం ఇచ్చారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం బస్టాండు వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చంద్ర, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్‌కే పరిమితమైన దీనకుమార్

కేవీబీపురం: రద్దు చేసిన మా పింఛన్లు తిరిగి ఇప్పించాలని దివ్యాంగులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో మాలతికి వినతిపత్రం అందజేశారు. ● మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన దీనకుమార్‌కు 89 శాతం వికలత్వం ఉండగా రూ.15వేలు పింఛను ప్రభుత్వం ఇచ్చేది. ఇటీవల చేసిన రీసర్వేలో రూ.15వేలు కాస్త రూ.6వేలుగా మార్పు చేశారు. దీంతో తాను ఏ పని చేసుకోలేనని, తనకు పింఛను తగ్గించి పొట్ట కొట్టొద్దని బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవోకు విన్నవించుకున్నారు. తనకు రూ.15వేలు ఇప్పించాలని ఆయన కోరారు.

పంచాయతీల్లో ఆడిటింగ్ ప్రారంభం

సత్యవేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనుల కోసం వెచ్చించిన నిధులపై మండలంలో ఆడిటింగ్ ప్రారంభమైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో జిల్లా అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి రామకృష్ణంరాజు, సీనియర్ ఆడిటర్లు సాయిశంకర్, అయ్యప్ప, పార్వతి తదితరుల బృందం మండల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి వివిధ పద్దుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ఆదాయ వ్యయాలను ఆడిటింగ్ అధికార బృందం తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ సెక్రటరీ తమ పంచాయతీకి సంబంధించిన రికార్డులు, బిల్లులను సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలన్నారు. ఇంతకు ముందు పని చేసిన పంచాయతీ సెక్రటరీ నుంచి ఇందుకు సంబంధించిన బిల్లులను సేకరించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆడిటింగ్ పూర్తవడానికి సహకరించాలన్నారు. కాగా మండల పరిషత్ నిధుల ఆదాయ, వ్యయాల సంబంధించిన ఆడిటింగ్‌తో పాటు 28 పంచాయతీల ఆడిటింగ్ నిర్వహించనున్నారు. సమావేశంలో మండలంలోని పలు పంచాయతీల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భారత్ గ్యాస్ సమీపంలో పుత్తూరు-చెన్నై హైవేపై బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా... పిచ్చాటూరు మండలం అప్పంబేడు గ్రామానికి చెందిన బాలమురుగన్(28) బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తలకు బలమైన గాయం తగిలినందుకు ఆయన్ను వైద్యులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ నామినేషన్లను వేగవంతం చేయాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ అన్నారు. పుత్తూరు డివిజన్‌లోని అన్ని యాజమాన్యాల సైన్స్ ఉపాధ్యాయులతో ఇన్‌స్పైర్ అవార్డు-2025 నామినేషన్ల ఒకరోజు శిక్షణ పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇన్నోవేషన్ ఐడియా బాక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలతో కూడిన ఎగ్జిబిట్లతో ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు చేయించాలని కోరారు. ఆగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు వీరేష్, ప్రేమ్‌కుమార్ ఆగస్త్య విర్చువల్ స్కూల్‌పై శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలో భువనేశ్వరి, భారతి, హెచ్ఎం వెంకటయ్య, రిసోర్స్ పర్సన్స్ కామాక్షయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, లింకన్, రుద్రయ్యమూర్తి, స్టాలిన్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే సంపూర్ణ ఆరోగ్యం



పిచ్చాటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పిచ్చాటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలన చేయడంతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్లు మునిచరిత, ధనుష్‌లు తెలిపారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని నినాదాలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బీఎన్‌కండ్రిగలో వైద్య సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు అనాఫిలస్ దోమ నుంచి వ్యాపిస్తాయన్నారు. దోమల నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బందితో డాక్టర్ ఉదయ్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.